

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోదూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

"**సరేగాని**, స్వర్ణా బిటెక్ అయిపోతుంది కదా ఏం చేద్దామని వుంది నీకు?"

"ఏదైనా జాబ్ చూసుకుంటాను అన్నయ్యా."

"ఏయ్, ఇలా దగ్గరకు రామ్మా" అంటూ చెయ్యిపట్టి దగ్గరకు లాగాడు.

"నీకు పై చదువులు ఏమి చదవాలి అని ఉన్నా చదువుకో. నేనున్నానుగా, నేను చూస్తాను" అన్నాడు.

"థ్యాంక్స్ అన్నయ్యా" అంది స్వర్ణ.

"అన్నయ్యకు థ్యాంక్సేంటమ్మా?" అన్నాడు తల నిమురుతూ.

ప్రభావతి కళ్ళు చెమ్మగిల్లాయి. "తల్లితండ్రులకు తగిన కొడుకు" అనుకుంది.

"పిన్నీ ఇదిగో ఈ కవర్ ఉంచండి. సంతోష్‌కు దొరకనివ్వకండి" అంటూ ఒక కవర్ ఇచ్చాడు.

"ఆగు బాబూ" అంటూ కవర్ తెరిచి చూసిన ప్రభావతి "ముప్పైవేలా? చాలా ఎక్కువ. వద్దమ్మా. నీకు బోలెడు ఖర్చులుంటాయి" అంది ఆమె కవర్ తిరిగి ఇచ్చేయబోతూ.

"పిన్నీ, నేను నీ కొడుకునే అనుకోవెందుకు? వాళ్ళతోపాటే నన్నూ పెంచావుగా. ఎందుకు వేరు చేసి చూస్తావు నన్ను? చెమ్మగిల్లిన హేమంత్ కళ్ళను చూసి "బాబూ!" అంటూ దగ్గరకు తీసుకుంది ప్రభావతి.

"పిన్నీ, నీకో విషయం చెప్పాలి నేను. మామయ్య కూతురు ఇందిర ఏడుస్తుంది క్రింద. అత్తయ్య, మామయ్య కూడా సమర్థిస్తున్నారు తనను. నన్ను అల్లుడిని చేసుకోవాలనుకున్నాడట ఆయన. వీళ్ళు నలుగురూ కూడా ఒకే బంధంగా పెరిగాను నేను. చెప్పినా అర్థం చేసుకోకుండా బాధపడుతున్నారు. నా మనసులో బాధగా వుంది వాళ్ళలా బాధగా వుంటే. నాకు కొంచెం ఈ సాయం చెయ్యి పిన్నీ. అర్థమయ్యేలా చెప్పు వాళ్ళకు కొంచెం."

"అలాగే లే హేమంత్. నేను చూస్తానులే, నువ్వేం మనసును బాధించుకోకు" అంది ప్రభావతి.

"ఇంకొక విషయం పిన్నీ. ఇందిరకు గాని స్వర్ణకు గాని పెళ్ళి చెయ్యదలచుకుంటే మంచి సంబంధాలు చూడండి. ఖర్చు గురించి వెనకాడకండి. మీరు తొందరపడి వేరే నిర్ణయాలు తీసుకుంటారేమోనని ముందే చెపుతున్నాను. ఏమీ అనుకోవద్దు" చెప్పాడు హేమంత్.

"ఒరేయ్ హేమంత్, చిన్నవాడివైనా మా అందరి గురించీ ఆలోచిస్తున్నావమ్మా. నీలో మీ అమ్మా, నాన్నా కనిపిస్తున్నారు" మది హేమంత్‌ను గుండెకు హత్తుకుని.

"చిన్నప్పుడు స్వర్ణ, సంతోష్‌లలాగే 'అమ్మా' అని పిలిస్తే కాదు 'పిన్నీ' అని పిలవాలని అలవాటు చేసావు. ఇపుడు కూడా దయచేసి అటువంటి వేర్పాటు చెయ్యకండి" అంటూ మెట్లు దిగుతున్న హేమంత్‌తో కలిసి కిందకు వెళ్ళింది ప్రభావతి.

"లతా వెళ్దామా?" అన్నాడు.

"ఒక్క నిమిషం ఆగండమ్మా" అంది లతను ఉద్దేశించి.

లోపలకు వెళ్ళిన ప్రభావతి పళ్ళెంలో చీర, బ్లౌజ్ పీస్, పువ్వులు, రెండు ఏపిల్ పళ్ళు తెచ్చింది.

లత నుదుట బొట్టి పెట్టి అవి చేతిలో పెట్టింది. ఆమె ఉద్వేగానికి గురైంది.

"ఇలా దగ్గరగా వచ్చి అమ్మాయి పక్కన నిలబడు హేమంత్" అని పిలిచింది.

"చక్కగా, అందంగా ఉన్నారు ఇద్దరూ. సుఖంగా ఉండండి. మీ పెళ్ళి త్వరలోనే జరగాలి" అంటూ దీవించింది ఆమె.

ఇద్దరూ ఆమె పాదాలకు నమస్కరించారు. ఇద్దర్నీ దగ్గరకు తీసుకుంది ఆమె "వస్తూ ఉండండమ్మా" అంది.

బైక్‌ను ఐస్‌క్రీం పార్లర్ దగ్గర ఆపాడు హేమంత్.

"హేమ్, చలిగా లేదూ? ఐస్‌క్రీం తిందామా?" అంది లత.

"నాకు బుర్ర వేడెక్కిపోయింది. కొంచెం చల్లబరుచుకోవాలని కోరిక. వద్దంటే చెప్పు. మానేద్దాం."

"లేదు, తిందాం హేమ్" అంటూ దిగింది లత.

"బటర్‌స్కాచ్ రెండు" చెప్పాడు వెయిటర్‌కు.

"హేమ్, కొంచెం అప్‌సెట్ అయినట్టున్నావ్. ఏం జరిగింది?"

"ఏం లేదులే" అన్నాడు. ఒకసారి అతడి ముఖంలోకి చూసి మౌనం వహించింది లత.

"రేపు వెళ్దామా? వస్తావా?" అడిగాడు ఐస్‌క్రీం తింటూ.

"ఏమైనా పనులుంటే వద్దులే. ప్రయాణం ఉందిగా నీకు."

"పనులదేముందిలే లతా. కొంచెం అలా ఎక్కడికైనా వెళ్తే నీ మనసు కూడా బాగుంటుందని. నేను ఏ ఫారిన్‌కో వెళ్ళిపోతున్నట్టు బెంగ పెట్టేసుకుంటున్నావ్ కదా. అందుకే రేపంతా నీతో స్పెండ్ చేయాలనిపించింది" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"నన్ను వదిలి వెళ్తున్నందుకు నీకు ఏ ఫీలింగ్ లేదా హేమ్?"

"ఈ మధ్య ఏంటో, ఫీలింగ్స్‌తో సరిపెట్టుకో  బుద్ధికావటం లేదమ్మా."

"అంటే?" అంటూ చూసింది అతడి కళ్ళలోకి.

"అంటే? అంటే ఏం చెప్పమంటావ్?"

"చెప్పాలి హేమ్" అంది.

"ఈ నీ, నాలను 'మన'గా మార్చుదాం అనిపిస్తుంది నాకు కూడా" చూపును మరల్చుకుంది లత. ఆమె చేతిపై చెయ్యి వేస్తూ.

"ఏంటి ముఖంలోకి కొత్త కలర్ ఏదో వచ్చింది? నేను వెళ్తుందే తమరి ఫీలింగ్స్‌కు విలువనిచ్చే మమ్మీ, డాడీలతో మాట్లాడి నువ్వు,నేనులను 'మనం'గా మార్చమని అడగటానికే."

అతడి చేతిపై రెండో చేతిని వేసింది.

"హేమ్ ఐ లైక్ యు" అంటు.

"ఏంటి లైకా? అంతేనా?"

"ఇప్పటికి ఇంతేనమ్మా" అంది చేతులు వెనక్కు తీసుకుంటూ.

"హేమ్, మీ ఆంటీ మనకు త్వరలో పెళ్ళి అవ్వాలి అన్నారేంటి?"

"నీ ముఖం చూడగానే అర్థమైపోయి వుంటుంది తనకు."

"ఏమి అర్థమైపోయి వుంటుందో చెప్పు హేమ్."

నవ్వేసాడు. "ఏమీ అనుకోను అంటేనే చెప్తాను మరి" అంటూ.

"నువ్వు చెప్పేదాన్ని బట్టి రియాక్షన్ ఉంటుందిలే" అంది.

"బైక్ ఎక్కి కూర్చుని పిల్లోడిని ఇక్కడకు, అక్కడకు అని తిప్పేస్తుంది. పెళ్ళైపోతే కుదురుగా ఉంటావనేమో."

"అలాగా" అంటూ అతడి చేతిపై గిచ్చింది లత.

"అమ్మా" అప్రయత్నంగా గట్టిగా అన్నాడు.

పార్లర్‌లో ఉన్న ఇద్దరు ముగ్గురు వెను తిరిగి చూసారు.

వెయిటర్ వచ్చాడు, "ఏమైనా కావాలా సార్?" అంటూ.

"నేను పిలిచింది అమ్మను. నువ్వు వచ్చావేంటి?" అన్నాడు హేమంత్ చేతిపై రెండో చేత్తో పాముకుంటూ.

వెయిటర్ అయోమయంగా చుట్టూ చూస్తూ వెళ్ళిపోయాడు.

"నొప్పి పుట్టింది. మరీ ఇంత సున్నితమా?"

"నేనూ అదే అడుగుతున్నాను. చిన్నగా గిచ్చితే అంత రియాక్షనా?"

"దీన్ని గిచ్చటం అనరు. కుట్టటం అంటారు. కందిరీగ కుట్టినట్టు కుట్టేవ్."

"కుట్టటం ఏంటి?" నవ్వేస్తూ అంది.

"న్యూటన్స్ థర్డ్ లా గుర్తుందా? ఫర్ ఎవ్విరి యాక్షన్.. రేపు చూస్తావుగా యాక్షన్."

"అబ్బో డాక్టర్ గారికి ఫిజిక్స్ కూడా బాగానే వంటబట్టింది" అంది నవ్వుతూ.

"బైక్ దిగవా? హాస్టల్ దగ్గరకు వచ్చాం" అన్నాడు.

అపుడు పరిసరాలను గుర్తించింది లత.

"దిగాలనిపించటం లేదు హేమ్" అంటూ దిగింది.

"రేపు మార్నింగ్ సెవెన్‌కు రెడీ అయి ఉండాలి నువ్వు .మర్చిపోయాను పిన్ని ఇచ్చిన చీర కట్టుకో."

"అలాగే సర్"అంది.

"ఇక రాత్రి కోడి నిద్రపోదనుకుంటాను, ఎప్పుడు తెల్లారుతుందా అని" వెంటనే చేతిని వెనక్కు తీసుకున్నాడు నవ్వేస్తూ.

"అమ్మో కందిరీగ కుట్టేస్తుంది" అంటూ.

"కుట్టనులే. బై హేమ్" నవ్వుతూ చెప్పి వెళ్ళిపోతున్న లత వైపే చూస్తూ ఉండిపోయాడు హేమంత్.

"ఈ అమ్మాయి లేకుండా ఉండటం చాలా కష్టం" అనుకుంటూ బైక్ ను స్టార్ట్ చేశాడు.

పైన కిటికీలోనుంచి చూస్తున్న లత ఏ బైక్ వస్తున్నా హేమంతేనేమో అని చూస్తుంది.

సెల్ రింగ్ అవ్వటంతో "హలో" అంది.

"కిందకు రా లతా" హేమంత్ మాట వింటూనే

"వస్తున్నా" అంటూ హ్యాండ్ బ్యాగ్ తీసుకుని తొందర తొందరగా క్రిందకు వెళ్ళింది. రోడ్డు వైపు చూసింది. ఎక్కడా బైక్ కనపడలేదు.

మళ్ళీ ఫోన్ రింగవ్వటంతో ఆన్ చేసింది.

"ఎక్కడ హేమ్?" అని అడిగింది.

"ఫేస్‌ను కొంచెం రైట్‌కు తిప్పి చూడు" అన్నాడు.

చూసిన లత నవ్వుతూ వెళ్ళింది, తనకు కుడివైపునే ఆగివున్న కారును చూసి.

లెఫ్ట్ డోర్ తెరిచాడు హేమంత్. ఒక్క క్షణం చూస్తూ నిలబడింది లత.

"ఓయ్, రండి మేడమ్" అన్నాడు.

కారెక్కి కుర్చుంది.

"ఏమిటి మౌనం?"

"ఈ రోజు కారు వచ్చిందేంటా అని ఆలోచిస్తున్నాను."

"బైక్ అయినా కారైనా  వచ్చినవాడు హేమంతేగా!"

"అవును కదా" అంది నవ్వేస్తూ.

"తమరు చీరతో బైక్ మీద కూర్చుంటే, ఎక్కడ పక్కకు జారిపోతవో అని చూసుకోవటంతోనే సరిపోతుంది. పైగా ఈ రోజంతా నీతో కలసి హాయిగా కారులోనే తిరగాలనిపించింది లతా."

నెమ్మదిగా అతడివైపు జరిగింది లత. తల నెమ్మదిగా  అతడి భుజంపై వాల్చింది.

"కారైతే హాయిగా ఇలా కూర్చోవచ్చు" అంటూ.

"వద్దన్నదెవరు? స్టీరింగ్‌కు, గేర్లకు అడ్డురానంత వరకు నీ ఇష్టం" అన్నాడు హేమంత్ చిన్నగా నవ్వుతూ.

"హేమ్ ఎక్కడికి వెళ్తున్నాం?"

"నువ్వే చెప్పు లతా. నీదే ఛాయిస్."

"ఎక్కడికైనా హేమ్. నీతో ఇలా కలిసి ఉంటే చాలు" అంది.

"సరే. హ్యాపీగా, ఫ్రీగా ఉండు లతా" అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"మర్చిపోయాను, ముందు సీటు బెల్ట్ పెట్టుకో" అంటూ కారు స్లో చేసి ఆమెకు సీట్ బెల్ట్ పెట్టాడు అటు వాలి.

"లతా నేను తిరిగి వచ్చాక నీకు డ్రైవింగ్ నేర్పుతాను."

"ఆ ట్రాఫిక్ చూడగానే నాకు కంగారు వచ్చేస్తుంది హేమ్."

"ముందు అలాగే అనిపిస్తుంది లతా. నేర్చుకుని డ్రైవ్ చేస్తుంటే అలవాటైపోతుంది. అంతే."

"అలాగేలే హేమ్."

"రాత్రి అసలు నిద్రపోయావా?"

"నిద్ర పోనిస్తే కదా!"

"ఎవరో?"

"ఇంకెవరు? తమరే, కళ్ళు మూసినా తెరచినా నువ్వే హేమ్."

"నీకు బాగా ఎక్కువైపోయింది."

"ఏంటో అది?"

"చూడు లతా, నువ్వేం చిన్నపిల్లవు కాదు. జీవితం గురించి ఆలోచించటానికి చాలా టైముంది. ముందు మంచిగా ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవు" అంటూ రేడియో ఆన్ చేసాడు హేమంత్.

రఫీ సాంగ్ మనసును తాకుతూ సాగిపోతుంది.

"పూరబ్ పశ్చిమ్, ఉత్తర్ దక్షిణ్ మేరె ప్యార్‌కి సీమా..."

"లతా, నాకు ఈ సాంగ్స్ అన్నీ ప్రాణం. నాకు డ్రైవింగ్‌లోనే ఇవి హ్యాపీగా వినే అవకాశం దొరుకుతుంది" చెప్తున్న హేమంత్ ఆగాడు. కారు స్లో చేసి రోడ్డుకు పక్కగా ఉన్న ఒక చెట్టు కింద ఆపాడు, తర్వాత పాట మొదలవ్వగానే.

"చౌదవీక చాంద్ హో"

"ఈ పాట వినేసి బయల్దేరదాం" అన్నాడు.

అతడు సైలెంట్‌గా పాట అయ్యేదాకా ఆగాడు. చేతిలో వున్న లత చేతిని పెదవులపై ఉంచుకుని, నెమ్మదిగా వదిలేసాడు.

"నా జీవితంలోకి కూడా ఎవరైనా చందమామలాంటి అమ్మాయి వస్తే బాగుండును అనుకునేవాడిని."

"వచ్చిందా మరి?"

"వచ్చిందిలే ఒక సీమ మిర్చిలాంటి అమ్మాయి" కొంటెగా లత ముఖంలోకి చూసి నవ్వుతూ అన్నాడు.

"ఒకసారేమో సంపంగి పువ్వు, ఒకసారి సీమ మిర్చి.. ఎక్కడైనా సిమిలీ ఒకదానితో ఒకటి సింక్ అవుతుందా?" నవ్వేస్తూ అంది.

ఒకసారి చుట్టూ పరిసరాలు చూసాడు హేమంత్. పక్కనే ఒక మామిడి తోట ఉంది నిండా కాయలతో.

అందులో తాటి చెట్లవైపు చూపిస్తూ "అవి ఎలా తింటారు? నువ్వు తిన్నావా ఎపుడైనా?" అడిగాడు.

"అవి తినాలంటే ముందు నువు తాటి చెట్టు ఎక్కాలి హేమ్" అంది లత చిలిపిగా.

"పద, నేను ఎక్కుతానో, లేక నిన్ను ఎక్కిస్తానో చూద్దాం పద" అంటూ కారును కొంచెం లోపలికి తీసుకెళ్ళి ఆపాడు.

"దిగు లతా" అంటూ దిగాడు. లత కూడా దిగాక కారును లాక్ చేసి లోపలకు కొంచెం నడిచేసరికి కాపలా ఉన్న మనిషి వచ్చాడు పరుగున.

"మేము ఆ చెట్టు కాయలు" అంటూ తడుముకుంటూ మాట్లాడుతున్న హేమంత్‌ను చూసి గలగలా నవ్వింది లత.

"ముంజి కాయలను చూసి వచ్చాం. ఎవరైనా కోసే వాళ్ళుంటారా?" అడిగింది లత.

"పక్క తోటలో ఉండాడు సార్. ఉన్నాడో లేదో చూస్తాను" అంటూ వెళ్తున్న అతడిని,

"మేము ఆ లోగా తోటంతా తిరిగి చూడొచ్చా సరదాగా?" అడిగాడు.

"దానికేముంది బాబూ చూడండి. నే వస్తాను" అంటూ వెళ్ళాడు అతడు.

"ఇక్కడ నిలబడి ఏం చూస్తావ్ లతా? పద అలా ముందుకు వెళ్ళి చూద్దాం" అంటూ లత చెయ్యి పట్టుకుని నడిచాడు హేమంత్.

చెట్లనిండా రకరకాల మామిడి కాయలు ఉన్నాయి అందంగా వేలాడుతూ. తోట వెనుక వైపున చిన్న సైజు కొండ ఒకటి ఉంది.

"అక్కడకు ఎక్కుదామా హేమ్?" అంటూ పరుగున ముందుకు వెళ్ళింది లత.

ఆమెను అనుసరించి "ఆగు లతా" అంటూ వేగంగా వెళ్తున్నాడు హేమంత్.

ఆ ప్రదేశమంతా వేర్వేరు రంగులలో, ఆకారాలలో ఉన్న చిన్న పెద్ద రాళ్ళున్నాయి. లత అవి ఏరింది కొన్ని. వాటిని చేతులలో పట్టుకుని నడుస్తుంది.

"ఏవి ఇలా ఇవ్వు" అంటూ కర్చీఫ్ తీశాడు హేమంత్.

అతడి ముఖంలోకి ఒకసారి చూసి అతడి చేతిలో వున్న కర్చీఫ్‌లో వేసి మూటలా కట్టింది.

"ఏం చేస్తావు  అవి?" అడిగాడు హేమంత్.

"ఏమో? ఏదో సరదా అంతే" అంది.

"ఇవే మరి చిన్నపిల్లల వేషాలంటే."

నవ్వేసింది లత. "నీతో అలాంటి మాటలు అనిపించుకోవటం నాకు ఇష్టం హేమ్" అంది అతడి చెయ్యి పట్టుకు నడుస్తూ.

పక్కనున్న పొదల్లో ఏదో అలికిడి అయింది.

"అమ్మో" అంటూ రెండడుగులు హేమంత్ చెయ్యి వదిలి పరిగెత్తింది. అంతే హైహీల్ చెప్పుల కింద రాళ్ళు దొర్లటంతో బ్యాలన్స్ తప్పి పడిపోతున్న లతను ఆపే ప్రయత్నంలో కొండవాలు కావడంతో కొంచెం క్రిందకు జారిపోయాడు హేమంత్.

ముందు అతడు పడ్డాడు. అతనిపైన లత పడింది.

"లేలే" అంటూ లేవబోతున్న హేమంత్‌ను ఆపింది లత.

"నువ్వు పడటం కాదు కాని, నన్ను కూడా పడేశావు" ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"అవును ఇద్దరం పడ్డాం. ఇదొక తీపి అనుభూతి హేమ్" అంది అతడి చేతిని చెంపకు ఆనించుకుంటూ.

"లవ్ యు హేమ్" అంటూ అతడి బుగ్గపై చిన్నగా ముద్దు పెట్టింది.

"లవ్ యు టూ లతా" అంటూ లేచి ఆమెకు చెయ్యి అందించి లేవదీశాడు. మౌనంగా తల వాల్చి నిలబడిపోయిన లతను దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకున్నాడు హేమ్. ఆమె పెదవులను మృదువుగా తాకి "ప్లీజ్" అంటూ దూరంగా జరిపాడు ఆమెను.

"కాలం ఇక్కడే ఆగిపోతే" అంది లత అతడి కళ్ళలోకి చూస్తూ.

చూపును మరల్చుకున్నాడు హేమంత్ ఆమెపై నుంచి.

"లతా.. రా అమ్మా" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని కొండ దిగాడు హేమంత్.

"ఎప్పటికీ ఇలాగే నీకు దగ్గరగా ఉండాలనిపిస్తుంది హేమ్."

"ఎందుకుండదూ.. నాకూ ఉంది. ఏదైనా అంటే కందిరీగలా కుడతావు చటుక్కున. అదే భయం నీతో. మర్చిపోయాను నిన్న ఎక్కడ కుట్టావ్ ఐస్క్రీం పార్లర్‌లో.. ఇదిగో చూడు ఇంకా తగ్గలేదు మంట.."

మధ్యలోనే అడ్డు వస్తూ అంది "కుట్టటం ఏంటి? నేనేమైనా.."

"ఇక చాలు పదమ్మా, ఈ పాటికి అతడు మనని వెతుక్కుంటున్నాడేమో?"

"కాసేపు ఆగలేడా అతడు?"

"నీ గురించి చెప్పాలంటే తెలుగు భాషలో పదాలు లేవు లతా. అదుగో చూడు నీ ఫ్రెండ్ వచ్చేసింది వెతుక్కుంటూ" అన్నాడు చూపిస్తూ.

ఝుమ్మని శబ్దం చేస్తూ పెద్ద నల్లటి కందిరీగ అక్కడే ఎగురుతుంది అటూ ఇటూ ఎగురుతూ.

"కందిరీగ" అంటూ చటుక్కున అతడి గుండెపై తల దాచుకుంది.

"పోయిందిలే అది. అయినా తెలియక అడుగుతానూ స్వజాతిని చూసి భయపడతారా ఎవరైనా?"

"పో హేమంత్, మరీ చిలిపితనం ఎక్కువైపోతుంది."

"పో అంటే పొమ్మని వదిలేయాలిగా మరీ ఇంత టైట్‌గా పట్టుకున్నావ్. ఎలా పొయేది చెప్పు" అన్నాడు ఆమె అరచేతిలో గోరుతో చిన్నగా గిచ్చుతూ.

"అబ్బ హేమ్" అంటూ వదిలేసింది.

"ఇది పద్ధతిగా వుంటుంది. రా, అదుగో వాళ్ళు మనకోసం చూస్తున్నారు" అంటూ ముందుకు నడిచాడు.

"సారూ అతడే కాయలు దించుతాడు. మీకు ఇక్కడ తినటానికేనా, తీసుకువెళ్తరా? అలా అయితే ఎక్కువ దించమంటాను" అన్నాడతడు.

"ఇక్కడ తినటానికేలే" అంటూ పర్స్ తీసి కాపలా మనిషికి డబ్బులిచ్చాడు.

"చిల్లరలేదు సారూ"

"చిల్లర వద్దు. నీకే ఇచ్చాను. ఉంచు" అన్నాడు హేమంత్.

"ఐదు వందలా! చాలా ఎక్కువ కదూ?" అంది లత.

"ప్లీజ్ లతా నాకు ఇచ్చిన తృప్తీ, అతడికి తీసుకున్న సంతోషం ఉంచి. అది చాలా ప్రమాదంతో కూడుకున్న పని కదా. వింటే బాధపడతాడు."

"లతా ఆ పక్క చెట్టుకు అలా కట్టారేంటి?" అడిగాడు హేమంత్. అది తాటికల్లు సారూ, తీసుకుంటారేంటి?" అడిగాడు అతడు.

"వద్దులే. అడిగానంతే."

"పోనీ చూడరాదూ కొంచెం వేసి" చిలిపిగా అడిగింది లత.

"ఏమి చూసేది, వేసేదీను? కొంపతీసి నీకు కావాలా ఏమిటి?" నెమ్మదిగా అడిగాడు.

"అది కల్లు అంటారు. ఎఫెక్ట్ ఈక్వల్ టు దిస్" అంది బొటన వ్రేలును నోటి దగ్గర పెట్టి చూపుతూ.

"లతా నీ దగ్గర చాలా నాలెడ్జ్ ఉంది .ఈ కాసేపట్లో నన్ను ఎడ్యుకేట్ చేశావ్, థ్యాంక్స్" అన్నాడు చెయ్యి ముందుకు చాపుతూ.

"గిచ్చాలనిపిస్తుంది. వద్దులే చెయ్యి వెనక్కు తీసుకో. మననే చూస్తున్నాడు. బయటకు వెళ్ళాక చెప్తా. ఆ చెట్లు మా పొలంలో చాలా ఉన్నాయి. మా మామయ్యకు అదే పని రోజూ. అందుకు తెలుసు నాకు" అంది.

చెట్టు పైనుంచి తాడుతో ఒక గెల కాయలు దించాడు అతడు. అతడు వెళ్ళిపోయాడు. కాపలా వ్యక్తి పాకలోనుంచి కత్తి తెచ్చి కాయలను సగానికి కోస్తుంటే లత అడిగింది, "బాబూ కొంచెం ముంజెలులా తీసి ఇవ్వగలవా?" అని.

అతడు, "దానికేం భాగ్యం దొరసానీ, తీస్తాను" అంటూ కాయలను చెక్కుతున్నాడు.

"లతా, నువు తినాలి, నాకూ తినిపించాలి. నేనెపుడూ తినలేదు" అన్నాడు హేమంత్.

"హేమంత్‌గారికి తినిపిస్తాం. కాని దానికి రెమ్యునరేషన్ కావాలి" అంది లత చిరునవ్వుతో.

"ఎంత?"

"ఎంత కాదు, ఏంటి?"

"సరే ఏంటి?" అడిగాక ఉలిక్కిపడ్డాడు, అర్ధమైంది అతడికి,

"సరే ఒప్పుకున్నాక తప్పదుకదా" అన్నాడు.

కారులోంచి వాటర్ బాటిల్ తెచ్చాడు హేమంత్.

ముంజికాయలకున్న డిప్పలను ప్లేట్లలా వాడాడతడు, ఒక్కోటి తీసి లతకు అందిస్తూ. అవి నెమ్మదిగా ఒలిచి హేమంత్‌కు అందించింది లత.

కొన్ని తిన్న హేమంత్ "చాలా బాగున్నాయి. వీటిలో నీళ్ళు ఉంటాయి అని చెప్పలేదేం లతా? షర్ట్ మీద పడ్డాయి" అన్నాడు. బాటిల్‌లో నీళ్ళను షర్ట్‌పై చల్లింది.

"వాష్ చెయ్యక పోతే డాగులు పడతాయి హేమ్. ఆరిపోతుందిలే." అంటూ తన పైట కొంగుతో అతడిని ఒత్తింది లత.

కాపలా వ్యక్తి నాలుగు మామిడి కాయలు తెచ్చి లతకు ఇచ్చాడు.

"థాంక్స్" అంటూ తీసుకుంది.

"హేమ్మ్, మేము ఇవి ఉప్పు, కారం అద్దుకు తినేవాళ్ళం" అంది.

"నే ఇస్తానమ్మా ఉప్పూ,కారం" అంటూ పాకలోనుంచి తెచ్చి ఇచ్చాడు అతడు.

"కొంచెం ఈ రెండు కాయలు కోసి ఇయ్యవా?" అడిగింది అతడిని. ఎవరో వచ్చి అతడిని పిలుస్తున్నారు రోడ్ మీదనుంచి.

"ఒక్క క్షణం సారూ, ఇపుడే వస్తా" అంటూ పరుగున వెళ్ళాడు.

ముంజి కాయలు కోసిన కత్తి అక్కడే వుంది.

చటుక్కున, హేమంత్ వద్దు అని చెప్పే లోపలే మామిడి కాయను ఎడమచేతిలో ఉంచి కత్తితో కోయబోయింది. అది కసుక్కున ఎడమ చేతి చిటికెన వేలుకు క్రిందగా అరచేతిని కోసుకుంది.

"అమ్మా" అంది ఒక్కసారిగా.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS